

నాటకాలు కట్టిపెట్టు నాని

చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నాని దొంగనాటకాలపై స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ధ్వజమెత్తారు. - 8లో



స్టోర్స్ పరిశీలన

చిత్తూరు కార్పొరేషన్:ఉమ్మడి జిల్లాలోని విద్యుత్ శాఖకు సంబంధించిన స్టోర్స్‌ను ట్రాన్స్‌కో డిస్కం జనరల్ మేనేజర్ షేక్ అహ్మద్ పరిశీలించారు.



అప్రమత్తంగా ఉండండి

కాణిపాకం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ప్రభావతి దేవి అన్నారు.

న్యూస్‌రీల్

'సాక్షి' మైత్రి మహిళ ఆధ్వర్యంలో... బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

తిరుపతి అర్బన్: 'సాక్షి' మైత్రి మహిళా ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి వచ్చే నెల 25వ తేదీ వరకు మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నారు. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిక్షణ ఉంటుంది. ఈ మేరకు త్రెడ్డింగ్, వ్యాక్స్, పెడిక్యూర్, మెనిక్యూర్, బ్లీచింగ్, స్కిన్ కేర్, హెయిర్ కేర్, వైట్నింగ్ ఫేస్ ప్యాక్స్, డ్యాండ్రఫ్ ట్రీట్మెంట్, హెయిర్ఫాల్ ట్రీట్మెంట్, హెయిర్ కట్స్, హెయిర్ స్టైల్స్, హెన్నా ప్రిపరేషన్, డైఅప్లికేషన్, మేకప్స్ (బ్రైడల్, పార్టీ, లైట్ మేకప్స్), హెయిర్ మసాజ్, కమ్యూనికేషన్ అండ్ గ్రూమింగ్, ఫేషియల్స్, శారీ డ్రాపింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు సర్టిఫికెట్లు జారీ చేస్తారు. ఆసక్తి గల వారు ఈనెల 27 వరకు బైరాగిపట్టిడలో ఆర్చి రోడ్డు అనంగా బ్యూటీ స్టూడియో ట్రైనింగ్ సెంటర్లో రూ.3 వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. పూర్తి సమాచారం కోసం 9553454335, 8555974855ను సంప్రదించగలరు.

9 వరకు టపాసుల వినియోగం నిషేధం

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా టపాసుల వినియోగంపై నిషేధం విధిస్తూ జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ ఉత్తర్వులు జారీచేశారు. అవాంఛనీయ సంఘటనల నివారణ, శాంతి భద్రతలను కాపాడేందుకు జూన్ 9వ తేదీ వరకు జిల్లాలో బాణసంచాలు (టపాసులు) వినియోగం, రవాణపై నిషేధం విధించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత గెలుపొందిన అభ్యర్థులు, వారి మద్దతుగా నిర్వహించే విజయోత్సవాలు నిర్వహించే క్రమంలో టపాసులు కాల్చడం వల్ల తలెత్తే పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. టపాసుల విక్రయదారులు ఈ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఎవరైనా నిబంధనలను పాటించకుండా ఉల్లంఘిస్తే భారతీయ శిక్షాస్మృతి 1860లోని సెక్షన్ 436 ప్రకారం శిక్షార్హులవుతారని ఆ ఉత్తర్వుల్లో హెచ్చరించారు.

ఎన్నికల విధులకు అదనపు ఎస్పీలు

చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఇతర ఎన్నికల విధుల కోసం చిత్తూరు, తిరుపతి జిల్లాలకు పలువురు ఎస్పీ (నాన్ క్యాడర్), అదనపు ఎస్పీలను కేటాయిస్తూ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు, గుంటూరులో సెబ్ ఏఎస్పీగా ఉన్న ఎం.వెంకటేశ్వరరావును చిత్తూరుకు నియమించారు. తిరుపతి జిల్లాకు సీఐడీ ఎస్పీ ఉన్న కెజీవి.సరిత, ఏసీబీ ఏఎస్పీ ఎం.మహేంద్ర, ఏసీబీ డీఎస్పీ ఎస్.శిరీషను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీళ్లు వెంటనే ఆయా జిల్లా ఎస్పీల వద్ద రిపోర్టు చేయాలని, అధికారులను ఎన్నికల విధులతో పాటు సమస్యాత్మక-సున్నితమైన అసెంబ్లీ స్థానాల్లో ఉపయోగించుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డీవైఈఓ పరీక్షలకు 296 మంది గైర్హాజరు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన డీవైఈఓ పోస్టుల పరీక్షలకు 296 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలోని మూడు పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు పరీక్షలను సజావుగా నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా డీవైఈఓ పరీక్షలకు 730 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 434 మంది పరీక్షలకు హాజరయ్యారు. 296 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. 59.45 శాతం హాజరు నమోదైనట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

- డ్వామా పీడీ రాజశేఖర్



డ్వామా పీడీ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : ఉపాధి హామీ పథకంలో గ్రామీణ ప్రాంత కూలీలలకు పనులు కల్పించడంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డ్వామా పీడీ రాజశేఖర్ హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధి కల్పనే ధ్యేయంగా క్షేత్రస్థాయి అధికారులు పనిచేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా ఉపాధి కూలీలతో గ్రామసభలు నిర్వహించి ఏఏ ప్రాంతాల్లో ఏ రకం పనులు చేపట్టాలో నిర్ణయించి పనులు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పనులు అడిగే ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు ఇస్తున్నామన్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు పనులను పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని డ్వామా పీడీ వెల్లడించారు.

ఓట్ల లెక్కింపునకు సిద్ధం

ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి జిల్లా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఓట్ల లెక్కింపు గడువు దగ్గర పడుతుండడంతో అందుకోసం అధికార యంత్రాంగం ముమ్మర కసరత్తు చేస్తోంది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ ఓట్ల లెక్కింపు అంశానికి సంబంధించి అనునిత్యం అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, ఎన్నికల డీటీలు, కౌంటింగ్ సిబ్బంది విధులకు సంబంధించి ఎన్నికల సంఘం మార్గదర్శకాలు విడుదల చేసింది. ముఖ్యంగా స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. నోడల్ అధికారులు సైతం ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి పర్యవేక్షిస్తున్నారు. అలాగే సిబ్బందికి కూడా ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి ఈ నెల 28న మొదటి విడత శిక్షణ ఇచ్చేందుకు కలెక్టరేట్ అధికారులు కసరత్తు చేస్తున్నారు.



కౌంటింగ్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు (ఫైల్)

- తొమ్మిది రోజుల్లో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్
- ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో కట్టుదిట్టంగా ఏర్పాట్లు
- నిబంధనలు జారీ చేసిన ఎన్నికల సంఘం

చిత్తూరు కలెక్టరేట్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ ప్రక్రియకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఓట్ల లెక్కింపునకు ఇక తొమ్మిది రోజులే సమయం ఉండడంతో జిల్లా యంత్రాంగం కసరత్తు వేగవంతం చేసింది. సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు అంశంపై ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, ఎన్నికల డీటీలు, కౌంటింగ్ సిబ్బంది విధులకు సంబంధించి ఎన్నికల సంఘం మార్గదర్శకాలు నిర్దేశించింది. ముఖ్యంగా స్ట్రాంగ్ రూమ్ లేఅవుట్‌పై ఇన్‌చార్జ్ అధికారి అవగాహన కలిగి ఉండాలి. నోడల్ అధికారులు వారికి



కౌంటింగ్ కేంద్రంలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్

అప్పగించిన పనులు సక్రమంగా నిర్వర్తించాలి. సందేహాలు వచ్చినప్పుడు ఆర్‌ఓలతో మాట్లాడాలి. పోస్టల్ బ్యాలెట్, స్ట్రాంగ్ రూమ్ నోడల్ అధికారులు, సీలింగ్ అధికారులు, రో-ఇన్‌చార్జ్‌లు అనుసరించాల్సిన విధి విధానాలను ప్రత్యేకంగా సూచించింది. పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్ ఓట్లు ఎలా లెక్కించాలి ? వ్యాలిడ్, ఇన్‌వ్యాలిడ్ ఓట్లను ఎలా గుర్తించాలి ? అనేదానిపై సిబ్బందికి ఈ నెల 28న మొదటి విడత శిక్షణ ఇచ్చేందుకు కలెక్టరేట్ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

చెక్‌లిస్టును అనుసరిస్తూ..

- జూన్ 3వ తేదీ సాయంత్రానికి ఎన్నికల సిబ్బంది కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలి.
- రౌండ్ల వారీగా ఫలితాల నమోదు, వాటిని ప్రకటించే క్రమంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి. అంకెల్లో పొరపాటు జరగకూడదు.
- రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో ఓట్ల లెక్కింపు నిర్వహించాలి. అలాగే సహాయ ఆర్‌ఓ ఆధ్వర్యంలో ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన స్థానిక తహసీల్దార్ ఆధ్వర్యంలో ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు.

ఏజెంట్లు, అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ ఓపెన్

- ఓట్ల లెక్కింపు రోజున కౌంటింగ్ ఏజెంట్లు, అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లు తెరుస్తారు. స్ట్రాంగ్ రూమ్‌లో ఒక నోడల్ అధికారి ఉంటారు.
- కౌంటింగ్‌కు ఈవీఎంలను ఆయన సిద్ధం చేస్తుంటారు. ఈవీఎంలకు సంబంధించిన ట్యాగ్ సరిగ్గా ఉందా ? లేదా ? అనేది పరిశీలిస్తారు.
- పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించేందుకు ఒక ఏఆర్‌ఓ, కంప్యూటర్ అసిస్టెంట్, కంప్యూటర్ సూపర్‌వైజర్, సూక్ష్మ పరిశీలకుడు ఉంటారు.

అభ్యర్థుల ప్రత్యేక నిఘా..

- కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన అభ్యర్థులు కౌంటింగ్ ప్రక్రియను, ఫలితాల తయారీ, డిక్లరేషన్‌ను దగ్గర ఉండి పరిశీలిస్తారు.
- కౌంటింగ్ పూర్తయిన తరువాత గెలుపొందిన అభ్యర్థికి ఫారం 21-ఈని అందజేయాలి.

కట్టుదిట్టంగా బందోబస్తు..



"ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించడం జరుగుతుంది. కౌంటింగ్ కేంద్రంలో కట్టుదిట్టంగా బందోబస్తు ఏర్పాటు చేశాం. ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ప్రకారం కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు వేగవంతంగా చేపడుతున్నాం. కౌంటింగ్‌లో పాల్గొనే అధికారులకు, సిబ్బందికి ఈ నెల 28న మొదటి విడత శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నాం. – షణ్మోహన్, జిల్లా ఎన్నికల అధికారి, చిత్తూరు

అల్లర్లు చేస్తే అణచివేస్తా

- 144 సెక్షన్ అమల్లో ఉంది
- ఎస్పీ మణికంఠ చందవోలు



పుంగనూరులో మాబ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న ఎస్పీ మణికంఠ, పోలీసులు

పుంగనూరు: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో గానీ, తరువాత గానీ ఎలాంటి అల్లర్లు సృష్టించినా అణచి వేస్తానని అల్లరిమూకలకు ఎస్పీ మణికంఠ చందవోలు గట్టి వార్నింగ్ ఇచ్చారు. శనివారం పట్టణ పురవీధుల్లో సాయుధ దళాలతో మాబ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పురవీధులలో కవాతు చేపట్టారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. గెలిచినా, ఓడినా గ్రామాల్లో రెచ్చగొట్టే చర్యలు ఎవరూ చేపట్టరాదని హెచ్చరించారు. అన్ని గ్రామాలు, పట్టణాల్లో పకడ్బందీగా సమాచారం సేకరిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఎన్నికల సందర్భంగా ర్యాలీలు, విజయోత్సవాలను రద్దు చేయడం జరిగిందన్నారు. ముందు జాగ్రత్తగా 144 సెక్షన్ అమలులో కొనసాగిస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వర రావు, డీఎస్పీ రఘువీరప్రసాద్, సీఐ రాఘవరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాణిపాకంలో భక్తుల పాట్లు

- వేసవి సెలవుల నేపథ్యంలో కాణిపాకానికి పోటెత్తుతున్న భక్తులు
- వీఐపీ గేటు ఎదుట గందరగోళం
- సిఫార్సులకే ప్రాధాన్యత ఇస్తున్న సిబ్బంది
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు
- హోంగార్డుల తీరుపై ఎస్పీకి భక్తుల ఫిర్యాదు



గేటు ఎదుట చుట్టిముట్టిన భక్తులు

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయకుడి ఆలయానికి భక్తులు పోటెత్తారు. దర్శనానికి పడరాని పాట్లు పడ్డారు. సిఫార్సులకు ప్రాధాన్యత ఇవ్వడంతో భక్తులు సిబ్బందితో గొడవకు దిగారు. దీంతో శనివారం ఆలయంలో గందరగోళం చోటుచేసుకుంది. సెలవులు కావడంతో వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి భక్తుల తాకిడి అధికమైంది. తిరుమలకు వచ్చే భక్తులతో పాటు తమిళనాడులోని తిరువణ్ణామలై, బంగారుగుడి సందర్శించే భక్తులు సైతం గణనాథున్ని దర్శనానికి వస్తారు. సాధారణ రోజుల్లో భక్తుల సంఖ్య 5 వేల నుంచి 10 వేల లోపే ఉంటుంది. సెలవు రోజుల్లో ఈ సంఖ్య 15 వేల నుంచి 20 వేలు దాటుతోంది. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో భక్తుల సంఖ్య ఏకంగా 30వేలు దాటుతోంది. ఉచిత దర్శనంతో పాటు వీఐపీ దర్శనం వైపు కూడా భక్తులు భారీగా క్యూ కడుతున్నారు. ఈ రద్దీ కట్టడి చేయడంతో సిబ్బంది ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. దీంతో భక్తులు ఆలయ సిబ్బంది తీరుపై మండిపడుతున్నారు.

అసలు ఏం జరిగిందంటే..!

శనివారం కూడా వందలాది మంది భక్తులు కౌంటర్ వద్ద రూ.500, రూ.1000 టిక్కెట్లు కొనుగోలు చేశారు. అయితే ఆలయంలోకి ప్రవేశానికి గంటల తరబడి గేటు ఎదుట వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ కారణంగా వీఐపీ గేటు ఎదుట భక్తజనంతో నిండుకుంది. సిబ్బంది గేటుకు తాళం వేసుకుని వెళ్లిపోయారు. కొంతమంది హోంగార్డులు, సిబ్బంది వాళ్లకు అనుకూలమైన వారిని మాత్రమే గేటు తాళం తెరిచి లోపలికి తీసుకెళ్లడంతో భక్తులు మండిపడ్డారు. హోంగార్డులపై ప్రశ్నల వర్షం కురిపించారు. అరుపులు, కేకలతో గేటు ప్రాంగణం దద్దరిల్లింది. దీంతో హోంగార్డులు భక్తులపై చిందులేశారు. ఈ విషయం తెలుసుకున్న ఈఓ వెంకటేశ్వర్లు గేటు ఎదుటకు చేరుకుని, స్పందించి ఒక్కొక్కరిని లోపలి పంపించే ప్రయత్నం చేశారు. దీంతో భక్తులు శాంతించారు.

సిబ్బంది పెత్తనంతో పాట్లు..

కాణిపాకంలో కొందరి సిబ్బందిదే పెత్తనం కొనసాగుతోంది. గేటు వేసి కాసులకు ఎర వేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను టార్గెట్ చేసి ఈ దందాలకు పాల్పడుతున్నట్లు విమర్శలు గుప్పుమంటున్నాయి. దర్శనానికి రూ.1000 నుంచి రూ.2000 వేల వరకు గుంజుకుంటున్నట్లు భక్తులు ఆరోపిస్తున్నారు. దీన్ని కట్టడి చేసేందుకు ఉన్నతాధికారులు సైతం లోకల్ ప్రభావంతో మిన్నకుండిపోతున్నారు. ఇక కొందరు హోంగార్డులు కొన్నేళ్లుగా ఆలయంలో పాతుకుపోయి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. భక్తులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారు. దీనిపై పలువురు భక్తులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

చర్యలు తీసుకుంటాం..



ఆలయ అభివృద్ధి చెందాలనే లక్ష్యంతోనే అధికారులంతా సమిష్టిగా పనిచేస్తున్నాం. ఎక్కడా ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. రద్దీ సమయంలో సమస్యలు వస్తే వెంటనే స్పందిస్తున్నాం. భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. భక్తులకు నుంచి ఫిర్యాదులు వస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకోం. కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. – వెంకటేశ్వర్లు, ఈఓ, కాణిపాకం

క్రమశిక్షణకు నిదర్శనం ఎన్‌సీసీ కేడెట్స్

- ఎన్‌సీసీ క్యాంపులో ఎస్పీ మణికంఠ

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్‌సీసీ కేడెట్లు క్రమశిక్షణకు, ఐక్యతకు నిదర్శనమని ఎస్పీ మణికంఠ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ శిక్షణా సెంటర్ లో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాంప్ కార్యక్రమంను ఎస్పీ మణికంఠ పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన కేడెట్లను ఉద్దేశించి ప్రసంగించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరడం ద్వారా నాయకత్వ లక్షణాలు పెంచుకోవచ్చన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలు, గంగమ్మ జాతరలో ఎన్‌సీసీ కేడెట్లు నిర్వహించిన విధులు అభినందనీయమని ప్రశంసించారు. క్యాంప్ కమాండెంట్ మేజర్ లోకనాథన్ మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ నుంచి కేడెట్లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఎన్‌సీసీ అధికారి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌సీసీతో విద్యార్థులకు దేశభక్తి పెంపొందుతుందన్నారు. అనంతరం పలు



హాజరైన ఎస్పీ దంపతులను దుశ్శాలువతో సత్కరించిన ఎన్‌సీసీ అధికారులు

పోటీల్లో గెలుపొందిన ఎన్‌సీసీ కేడెట్లకు సర్టిఫికేట్‌లు, బహుమతులు అందజేశారు. అతిథులుగా హాజరైన ఎస్పీ, ఆయన సతీమణిని దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు రమేష్, గిరిధర్‌నాయక్, చంద్రశేఖర్, కార్తీక్, వెంకటగోపాల్, చైత్రి, మొగిలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉన్నతాశయాలతో ముందుకెళ్లాలి

జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డి



క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థికి సర్టిఫికెట్ అంద జేస్తున్న జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ఇంజినీరింగ్ విద్యార్థులు ఉన్నత ఆశయాలతో ముందుకు వెళ్లాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డి అన్నారు. నగర సరిహద్దులోని మురకంబట్టు వద్ద ఉన్న సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 3వ అంతర్జాతీయ సదస్సు, క్రీడా దినోత్సవం కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పెద్దిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకుని ఉన్నత ఉద్యోగాలను సాధించాలన్నారు. మరో అతిథిగా పాల్గొన్న విట్ కళాశాల ప్రొఫెసర్ రజని మాట్లాడుతూ ఇంజినీరింగ్‌లో ఇమేజ్ ప్రాసెసింగ్ పోరియల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఉపయోగించడం వల్ల అనేక ఉపయోగాలుంటాయని తెలిపారు. ప్రస్తుత ప్రపంచంలో అభివృద్ధి చెందాలంటే ప్రతి విద్యార్థి సాంకేతికతను అందిపుచ్చుకోవాలని తెలిపారు. అనంతరం క్రీడాపోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటచలపతి, డీన్ శరవణన్, కోకన్వీనర్లు గోపి, ఉమామహేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన వ్యక్తి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని రెడ్డిగుంట వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. శనివారం ఓ చెట్టు కింద దాదాపు 45–50 ఏళ్ల మధ్య వయసు ఉన్న వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండడాన్ని చూసిన స్థానికులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇతన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి వద్ద ఓ సెల్‌ఫోన్ నంబరు ఉండడంతో, ఇతను తమిళనాడు వాసిగా పోలీసులు అనుమానిస్తున్నారు. టూటౌన్ సీఐ ఉలసయ్య కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిస్తే 9491074517, డయల్ 100కు నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

నాటకాలు కట్టిపెట్టు నాని!

'పులివర్తి నానిని రాజకీయ ప్రత్యర్థిగానే చూశాను తప్ప శత్రువుగా ఎన్నడూ చూడలేదు.. గతంలో నా బావమరిదిపై నాని చేయి చేసుకున్నాడు.. నామినేషన్ రోజు నా కారుపై దాడి చేశారు. అవమానాన్ని భరించామే తప్ప ఆవేశాలకు పోలేదు.. పద్మావతీ యూనివర్సిటీ దగ్గర నాని కారుపై దాడిచేయడం తప్పే.. అందుకే శిక్ష అనుభవిస్తున్నారు.. కారుపై కర్రతో దాడి జరగగానే అక్కడి నుంచి యాక్టివ్‌గా నడుచుకుంటూ దూరంగా వెళ్లిన నాని రెండు గంటల తర్వాత వీల్ చైర్‌లో మీడియా ముందు కనిపించాడు.. ఇదంతా ఓ డ్రామా.. నాటకాలు కట్టిపెట్టు నాని' అని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చంద్రగిరి నియోజకవర్గంలో జరిగిన వరుస దొంగనాటకాలను ఆయన వీడియోల ద్వారా మీడియాకు వివరించారు.

- కారుపై దాడి జరిగితే కాలుకు కట్టా ?
- పులివర్తి నాని నాటకాలతో శాంతి భద్రతలకు విఘాతం
- నానిని రాజకీయ ప్రత్యర్థిగా చూశానే తప్ప శత్రువుగా కాదు
- నా కారుపై దాడి చేసినా.. ప్రతి దాడి చేయలేదు..
- ఐదేళ్లలో నాని కుటుంబంపై ఒక్క కేసూ పెట్టలేదు
- మీడియాతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వెల్లడి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, పార్టీ నేతలు

తిరుపతి రూరల్: 'నాయకుడంటే వారి సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి..' అని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సూచించారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి జరిగిన ఘటనలు, వాటి వెనుక ఉన్న వాస్తవ పరిస్థితులపై శనివారం సాయంత్రం ఆయన తుమ్మలగుంటలోని తన స్వగృహంలో విలేకరుల సమావేశంలో వివరించారు. నామినేషన్ రోజున తన కారుపై దాడి చేసిన విధానం, పోలింగ్ రోజున తన కుమారుడు, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్‌రెడ్డిని అడ్డగించి, కార్లను దగ్ధం చేయడం, సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిని కాల్చివేయడం, పద్మావతి వర్సిటీలో నాని కారుపై దాడి జరగడం, ఆయనకు ఎలాంటి గాయాలు లేకుండా నడుస్తున్న విధానం, రెండు గంటల తర్వాత వీల్‌చైర్‌కు మారడం, తర్వాత జరిగిన దాడులకు సంబంధించిన వీడియోలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. కేవలం వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియాలనే లక్ష్యంతోనే వీడియోలను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒక వ్యక్తి ప్రచారం కోసం, ఒక వ్యక్తి తన పేరును జనాల్లోకి తీసుకెళ్లడం కోసం ఆధ్యాత్మిక తిరుపతి నగరం పేరును, ప్రతిష్టను అప్రదిష్ట పాలు చేస్తున్నారని విమర్శించారు. నాయకుడంటే పది మందికీ ఆదర్శంగా ఉండాలని, ప్రజలను రెచ్చగొట్టి దాని ద్వారా ప్రచారంపొంది, వ్యక్తిగత లబ్ధి పొందాలంటే అది తాత్కాలిక ప్రయోజనమేనన్నారు. కానీ నిజాలు బయటకు వచ్చిన తర్వాత తీవ్ర విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందని హితవు పలికారు. చంద్రగిరి, తిరుపతిలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనలను చూస్తే నిజం కన్నా వ్యక్తిగత ప్రచారం కోసం చేసిన డ్రామాలు అత్యంత రక్తి కట్టించినట్లు తెలుస్తోందన్నారు.

కారుపై దాడి చేశారు... కార్లను దగ్ధం చేశారు

చంద్రగిరి నియోజకవర్గంలో పలు ఘటనలను పరిశీలిస్తే కావాలనే రెచ్చగొట్టే విధానాలకు ప్రయత్నించినట్లు తెలుస్తోందన్నారు. నామినేషన్ రోజున సాక్షాత్తు ఎన్నికల అధికారి కార్యాలయంలోనే తన కారుపై రాళ్లు, కర్రలు, జెండాలతో దాడి చేశారని చెప్పారు. దాడి సమయంలో తాను కారులోనే ఉన్నానని, అయినా సంయమనం పాటించినట్లు పేర్కొన్నారు. పోలింగ్ రోజున తన కుమారుడు మోహిత్‌రెడ్డిని కూచువారిపల్లిలో అడ్డగించారని, రెండు కార్లను కాల్చివేశారని, గన్‌మన్ సహకారంతో వేరే కారులో మోహిత్‌రెడ్డిని పక్క గ్రామానికి తీసుకెళ్లారని చెప్పారు. మోహిత్‌రెడ్డిని పక్కకు పంపించారనే కోపంతో గన్‌మన్‌ను, మాజీ సైనికుడిని కిడ్నాప్ చేసి దారుణంగా హించించారని, ఈ మేరకు నాటి ఘటనలకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించారు. కూచువారిపల్లిలోనే తమ పార్టీకి చెందిన మార్కెట్ యార్డు చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిని పెట్రోలు పోసి కాల్చివేశారని తెలిపారు.

నాని కారుపై దాడిని ఖండించాం

పద్మావతి వర్సిటీలో నాని కారుపై దాడిని తాము ఖండించామని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరిపై దాడి జరిగినా అది మంచిది కాదన్నారు. అయితే కారుపై దాడిని కూడా తన ప్రచారం కోసం వాడుకోవాలనే ప్రయత్నాలను ఆయన విమర్శించారు. భానుతో పాటు వ్యక్తులు కారుపై మాత్రమే దాడి చేశారని, కానీ ఈ ఘటనలో నానికి ఎక్కడా గాయాలు కాలేదన్నారు. ఈమేరకు నాటి సంఘటన తర్వాత వర్సిటీ సీసీ కెమెరాల్లో నమోదైన వీడియోలను ప్రదర్శించారు. ఒక్కగాయం కూడా కాని నాని నడుస్తూ, అరుస్తూ, కొడుతూ వర్సిటీ ముందు ఆందోళన చేస్తున్న వీడియోలను సైతం చూపించారు. రెండు గంటల తర్వాత ఇంటికి వెళ్లి డ్రస్ మార్చుకుని దాడిలో గాయాలయ్యాయని వీల్‌చైర్ ఎక్కారని తెలిపారు.



నాని నాటకాలను ఆధారాలతో చూపుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

నాయకుడంటే హుందాగా ఉండాలి

నాయకుడంటే హుందాగా ఉండాలి. కార్యకర్తలు, నమ్మిన ప్రజలకు మంచి చేయాలి. వారికి భరోసా కల్పించే విధంగా ముందుండాలి. వారి సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి. ఉన్నత చదువులు చదివిన వ్యక్తిగా నా లక్ష్యాలు వేరు.. నా ఆలోచనలు వేరు.. నా బాధ్యతలు వేరు.. నా చదువు, సంస్కారాన్ని మంచి చేయడానికి తప్ప చెడు కోసం ఎట్టి పరిస్థితుల్లో ఉపయోగించను. అలాంటి మనస్తత్వం కూడా నాది కాదు.. నా కుమారు డు చెవిరెడ్డి మోహిత్‌డ్డి కూడా అలాగే పెరిగాడు.. రాజకీయాల్లోకి తీసుకువచ్చినపుడు ఒకే మాట చెప్పాను. ఎన్నికల్లో ఓడిపోతే.. ఒక మంచి వ్యాపారవేత్తగా వెళతావు.. ప్రజలు నీకు అవకాశం ఇస్తే.. నువ్వు జీవితాంతం వాళ్లకు సేవకుడిగా ఉండిపోతావు.. మనం ప్రజలకు మంచి చేసుంటే మనకు వాళ్లు కూడా మంచే చేస్తారు.. ఏది జరిగినా మన మంచికే అనుకుని ముందుకు వెళుతున్నాం'

అమాయకులపై దాడులు

నాని వర్సిటీ ముందు రెచ్చగొట్టడం వల్లే పదుల సంఖ్యలో అమాయకులపై టీడీపీ శ్రేణులు దాడులు చేసినట్లు ఎమ్మెల్యే చెవిరెడ్డి ఆరోపించారు. పోలీసు అధికారులపై రాడ్లతో దాడులు చేశారని, పోలీసు వాహనాలను ధ్వంసం చేశారని, అమాయకులను చావబాదారని, వాహనాలకు నిప్పు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో ఉన్న రోగిని పరామర్శించేందుకు వెళ్లిన వారిపై కూడా స్విమ్స్ ఐసీయూలోనే టీడీపీ మూకలు మూకుమ్మడిగా దాడి చేశారని, ఇది ఏ సంస్కృతికి నిదర్శనమని ప్రశ్నించారు.

ఐదేళ్లలో ఇలాంటివి ఒక్కటైనా జరిగాయా?

ప్రభుత్వ విప్‌గా, ఎమ్మెల్యేగా, ప్రభుత్వంలో కీలక వ్యక్తుల్లో ఒకరిగా తాను ఎప్పుడూ రాజకీయ వేధింపులకు, కక్షలకు పాల్పడలేదని ఎమ్మెల్యే చెవిరెడ్డి తెలిపారు. అందుకు నిదర్శనమే అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు నానిపైనగానీ, ఆయన కుటుంబ సభ్యులపైన గానీ ఒక్క కేసు కూడా నమోదు కాలేదని గుర్తుచేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని కోరుకున్నామే తప్ప, ఎక్కడా గొడవలు సృష్టించ లేదన్నారు. పోలింగ్ తర్వాత కూడా అందరూ స్నేహ భావంతో ప్రశాంతంగా ఉండాలని కోరుకునే వ్యక్తినే తప్ప, తనకు దాడులు చేయడం, చేయించడం రెండూ తెలియవన్నారు. తాను ఏపని చేసినా కష్టపడడం, ఆ తర్వాత దేవుడిని నమ్ముకుని వెళ్లడం మాత్రమే తెలుసన్నారు. రాజకీయాల్లో కూడా అలాగే ముందుకు వెళుతున్నానని, తన కుమారుడు మోహిత్ రెడ్డిని కూడా అలాగే పెంచానని చెప్పారు. అధికారం ఇచ్చిన ప్రజలకు భయపడి పనిచేయడం మాత్రమే తమకు తెలుసని, అధికారం కోసం ఎంతకైనా దిగజారడం తెలియదన్నారు. తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఆరు మండలాల నాయకులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద నామినేషన్ రోజున పులివర్తి నాని ఆధ్వర్యంలో వేలాది మంది టీడీపీ కార్యకర్తలు తన వాహనంపై దాడులు చేసిన దృశ్యాలను చూపుతూ..





వైఎస్సార్‌సీపీ నేతల ఇండ్లపై జరిగిన దాడులను వివరిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



పద్మావతి మహిళా వర్సిటీ వద్ద వాహనంలోనున్న టీడీపీ అభ్యర్థి పులివర్తినాని వాహనం పక్కనుంచి వెళుతున్న వైఎస్సార్‌సీపీ నేత భానుప్రకాష్‌రెడ్డిని చితకబాదుతున్న టీడీపీ నేతలు

చెరువు పోరంబోకు భూమి ఆక్రమణ

గంగవరం: చెరువు పోరంబోకు భూమిని ఓ టీడీపీ నాయకుడు యథేచ్ఛగా ఆక్రమించి జేసీబీతో చదును చేయించే ప్రయత్నం చేశాడు. అయితే విషయం తెలిసి శనివారం స్థానికులు స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గంగవరం ఫ్లైఓవర్ బ్రిడ్జికి సమీపంలో సర్వీస్ రోడ్డుకు ఆనుకుని 333/7 సర్వే నంబర్‌లో 1.72 ఎకరాల భూమి ఉంది. ఇది చెరువు పోరంబోకుగా రెవెన్యూ రికార్డుల్లో ఉంది. అయితే టీడీపీ నాయకుడు, గంగవరం మాజీ సర్పంచ్ మురళి గతంలో ఓసారి ఈ పోరంబోకు భూమిని ఆక్రమించాలని ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. అయితే ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఇదే అదునుగా భావించి జేసీబీతో శనివారం భూమిలో చదును చేయించాడు. ఇంతలో గ్రామస్తులు గుర్తించి తహసీల్దార్ లంకేశ్వర్‌రావుకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన వీఆర్‌ఓ ద్వారా భూమి ఆక్రమణను అడ్డుకున్నారు. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరగా రెవెన్యూ లెక్కల్లో ఈ భూమి చెరువు పోరంబోకుగా ఉండడం వాస్తవమే అన్నారు. అయితే ఈ భూమిపై కోర్టుకు వెళ్లినట్టు ఆక్రమణదారుడు చెప్పడంతో కోర్టు తీర్పు వచ్చేవరకూ పనులు చేయొద్దని హెచ్చరించినట్టు తెలిపారు.



చెరువు పోరంబోకు భూమిని చదును చేయించిన టీడీపీ నాయకుడు

47 పందుల అపహరణ

గంగవరం: గుర్తు తెలియని దుండగులు పందులను అపహరించుకెళ్లిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల మేరకు.. పలమనేరులోని గంటావూరుకు చెందిన భానుప్రకాష్ మండలంలోని పత్తికొండ గ్రామ సమీపంలో ఉన్న బెస్తగానపల్లికి వెళ్లే దారిలో గత మూడేళ్లుగా కాపురం ఉంటున్నాడు. పందులు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఇంటి సమీపంలోని చావిట్లో వదలిన 47 పందులను ఎవరో గుర్తు తెలియని దుండగులు అపహరించారు. ఉదయం నిద్రలేచి చూసేసరికి పందులు కనిపించకపోవడంతో బాధితుడు భాను ప్రకాష్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రూ.2 లక్షలు విలువ చేసే పందులను ఎవరో అపహరించారని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.